ప్రజావాణితో సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- మొత్తం 122 దరఖాస్తుల స్వీకరణ

కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : ప్రజావాణిలో వచ్చే సమస్యలు పరిష్కరిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి, కలెక్టర్, అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చే అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో పెట్టవద్దని స్పష్టం చేశారు. కాగా, ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 122 దరఖాస్తులు చేసుకున్నారని, అందులో రెవెన్యూ 67, సిరిసిల్ల మున్సిపల్ 18, జిల్లా పంచాయతీ అధికారి 2, జిల్లా వైద్యాధికారి 2, జిల్లా సంక్షేమ అధికారి 4, హ్యాండ్లూమ్ 3, ఎస్సీ కార్పొరేషన్ 1, ఎస్సీ సంక్షేమ అధికారి 4, ఎస్‌డీసీ 5, డీఆర్డీవో, వ్యవసాయ శాఖకు 2 చొప్పున, పౌరసరఫరా శాఖకు 3, విద్యాశాఖ, మత్స్య శాఖ, నీటిపారుదల శాఖ, ఎస్పీ ఆఫీస్, ఉపాధి కల్పన శాఖ, ఎంపీడీవో కొనరావుపేట, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట తంగళ్లపల్లికి ఒకటి చొప్పున వచ్చాయి. ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్

పెన్షన్ ఇప్పించాలని వినతి..

సిరిసిల్ల బీవైనగర్‌కు చెందిన దివ్యాంగుడు చిలుక విజయ్‌కుమార్ పెన్షన్ ఇప్పించాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాడు. పక్షవాతంతో బాధ పడుతున్నానని, పెన్షన్ ఇప్పించాలని విన్నవించాడు.

వాహనం ఇప్పించాలని..

సిరిసిల్లకు చెందిన బూర్గుపల్లి దేవయ్య దివ్యాంగుడి వాహనం ఇప్పించాలని, పెన్షన్ ఇప్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి వినతిపత్రం అందించాడు. ప్రభుత్వం ప్రత్యేక వాహనాలు అందిస్తుందని, తనకు కూడా ఇప్పించాలని కోరాడు.

రంగ నాయక్ సాగర్ నుంచి నీళ్లు విడుదల చేయాలని రైతు వినతి

రంగనాయక్ సాగర్ కాల్వ నుంచి తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ రాంచంద్రాపూర్‌తో పాటు ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామాల్లోని పొలాలకు కాల్వ ద్వారా నీళ్లు ఇవ్వాలని రైతులు ప్రజావాణిలో కలెక్టర్‌ను కోరారు. చెరువులు నీళ్లు లేక భూ గర్భజలాలు అడుగంటి పంట ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. చిన్నలింగాపూర్, దాచారం గ్రామస్తులు కోరారు. మహేశ్, స్వామి, మాధవరెడ్డి, మూడు గ్రామాల రైతులు ఉన్నారు.


చెక్కు అందజేస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దు

- రాబోయే సర్కార్ మనదే
- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 3 : పార్టీ కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దు రాబోయే సర్కార్ మనదేనని సెస్ చైర్మన్ చిక్కాల రామరావు పేర్కొన్నారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన మామిడాల శేఖర్ కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ సభ్యత్వ ప్రమాద భీమా రూ. 2 లక్షల చెక్కును మృతుడి భార్య లలితకు అందజేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మాజీ ఎంపీపీ పడిగెల మానస, పార్టీ నేతలతో కలిసి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ పార్టీ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో ఈ చెక్ మంజూరైందని బాధిత కుటుంబం ధైర్యంతో జీవించాలని, కార్యకర్తలు అధికారం లేదని భావించకుండా ప్రజా సమస్యలపై నిరంతరం ప్రభుత్వాన్ని నిలదీయాలని, కేసులకు బయపడకుండా ప్రజల పక్షాన పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడిగల మానస రాజు, మాజీ ZPTC కోడి అంతయ్య, గ్రామ అధ్యక్షుడు బండి జగన్, ప్యాక్స్ వైస్ చైర్మన్ వెంకట రమణారెడ్డి, మాజీ సర్పంచ్ అంకారపు రవీందర్, సద్ద రోజా, కందుకూరి రామా గౌడ్, కనక రాజు, అనిల్ గౌడ్, శివ, విజయ్, భాస్కర్, లింగం, తిరుపతి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రీడ్‌రూంను ప్రారంభిస్తున్న ఆనంద్

విద్యార్థుల్లో పఠణాశక్తి పెరుగుతుంది

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 3 : విద్యార్థుల్లో పఠణాశక్తి పెరుగుతుందని ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలోని శాత్రాజుపల్లిలోని గురుకుల డిగ్రీ కళాశాలలో రీడింగ్ క్లబ్‌ను ప్రిన్సిపాల్ లావాణ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రీడింగ్ క్లబ్ ఏర్పాటుతో విద్యార్థుల్లో పఠణాశక్తి పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుమలత, లైబ్రేరియన్ శ్రీలత, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

రుద్రంగి, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్ఎంపీ, పీఎంపీ మండలాధ్యక్షుడిగా దేశవేణి భూమేశ్‌ను క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా తన్నీరు వేణు, కార్యదర్శిగా రెమల అశోక్, కోశాధికారిగా పడాల శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు దేశవేణి భూమేశ్ మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీ అసోషియేషన్ సభ్యుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులు సన్నద్ధంగా ఉండాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి అశోక్ కుమార్
- ఎన్నికల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

కలెక్టరేట్ నుంచి హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : రాబోయే స్థానిక సంస్థల పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి ఎం అశోక్ కుమార్ సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి స్థానిక ఎన్నికల సన్నద్ధతపై అదనపు కలెక్టర్లు (లోకల్ బాడీస్)తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పంచాయతీలో 2వ సప్లిమెంట్ ఓటర్ జాబితా నమోదు, మండలాలకు ఎంపీటీసీల కేటాయింపు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన మ్యాన్‌పవర్, బ్యాలెట్ బాక్సుల సన్నద్ధత, సిబ్బందికి అవసరమైన శిక్షణ, రిటర్నింగ్ అధికారుల నియామకం, బ్యాలెట్ పేపర్ల ముద్రణ తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదీర్ఘంగా చర్చించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ కార్యదర్శి అందించిన సూచనలను నోట్ చేసుకున్నామని, క్షేత్ర స్థాయిలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటిస్తూ రాబోయే ఎన్నికలకు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాలో మొదటి దశలో 137 గ్రామాల్లో 1188 వార్డుల్లో, రెండవ దశలో 123 గ్రామాల్లో 1080 వార్డులలో ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించామని, సిరిసిల్ల జిల్లాలో అవసరమైన మేర సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డిప్యూటీ జడ్పీ సీఈవో గీత, అధికారులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు 'పోలీస్ అక్క'

ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : విద్యార్థునులు, మహిళలకు భద్రత కల్పించడంలో పోలీస్ అక్క సమర్థవంతంగా పని చేస్తోందని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రాంతాల్లో షీటీం, పోలీస్ అక్క సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, భరోసా కల్పించారు. పోలీస్ అక్క చేపట్టిన కార్యక్రమాలపై సోమవారం ఎస్పీ తన కార్యాలయంలో వివరించారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో పోలీస్ అక్క అనే కార్యక్రమం ద్వారా జిల్లాలోని విద్యాసంస్థల్లో 134 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థునులు, మహిళలను వేధిస్తున్న ఆకతాయిలపై 8 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో విద్యార్థునులు, మహిళల భద్రత, రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యక్తి గత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. పనిచేసే ప్రదేశాల్లో ఎక్కడైనా లైంగిక వేధింపులు, ర్యాగింగ్ లాంటి వేధింపులకు గురవుతున్న వారు మౌనంగా ఉండకుండా పోలీస్ అక్క సిబ్బందికి ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలపై అవహేళన చేసినా, ఉద్దేశ్యపూర్వకంగా వెంబడించినా ఫోన్ నంబర్ 8712656425కు ఫోన్ చేయాలని సూచించారు. విద్యా సంస్థలున్న చోట షీటీంలు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి, బైక్‌లపై త్రిబుల్ రైడింగ్‌గ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ విద్యార్థునులను వెంబడించిన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు

నర్మాల మానేరుకు మల్లన్నసాగర్ జలాలు

గంభీరావుపేట, ఫిబ్రవరి 3 : మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టుకు మల్లన్నసాగర్ కాల్వ నుంచి గోదావరి జలాలు చేరుకుంటున్నాయి. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 31 అడుగులకు గాను ప్రస్తుతం 24 అడుగుల నీరు ఉన్నది. మల్లన్న సాగర్ కాల్వ నుంచి కూడెల్లి వాగు ద్వారా గోదావరి జలాలను నాలుగు రోజుల క్రితం అధికారులు విడుదల చేయడంతో ప్రాజెక్టులోకి 550 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని డీఈ నర్సింగ్ తెలిపారు. ఆయకట్టు కింద యాసంగిలో సాగు చేసిన వరి పంట పొలాలు ఎండిపోకుండా చివరి వరకు నీరందేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రాజెక్టు నుంచి 110 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉందన్నారు.

కోనరావుపేటలో ఎస్ఎఫ్ఐ మహాసభ

కోనరావుపేట, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యాక్షులు జాలపెల్లి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలు పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగతున్నామన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా చెల్మల రాహుల్, కార్యదర్శిగా పిట్టల రాకేశ్‌ను ఎన్నుకున్నారు. నాయకులు ప్రవీణ్, షాదుల్ల, షఫీ, జశ్వంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నేతల పరామర్శ

కనగర్తి గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలు

కోనరావుపేట, ఫిబ్రవరి 3: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన సెస్ రిటైర్డ్ ఉద్యోగి మద్దూరి రాంరెడ్డి తల్లి శంకరవ్వ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు న్యాలకొండ రాఘవరెడ్డి, రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 3 : మండలంలోని జంగంరెడ్డి పల్లి గ్రామంలోని ఓ కల్యాణ మండపంలో బీఆర్ఎస్ నాయకుడు దయ్యాల మధు చెల్లెలి వివాహం సోమవారం జరుగగా, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆలయంలో జరిగిన అక్కెం సురేశ్-ఐశ్వర్య వివాహానికి హాజరై వారిని ఆశీర్వదించారు. అనంతరం మూడు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన రైతు తిప్పరవేణి శ్రీనివాస్ కుటుంబంతో పాటు పలువురు మరణించిన వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, మీసరగండ్ల అనిల్, రఘు, గౌతం ఉన్నారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 3: ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు డీఐఈవో శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 34 పరీక్షా కేంద్రాల్లో 3,281 మంది విద్యార్థులకు గాను ఈ నెల 22 వరకు నిర్వహించే ప్రయోగ పరీక్షలకు పూర్తి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, సోమవారం 13 సెంటర్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగిన పరీక్షలకు 980మంది విద్యార్థులకు గాను 924 హాజరకు కాగా, 56 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు కాకుండా ప్రతి సెంటర్లలో సుమారు నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిత్యం పర్యవేక్షించినట్లు వెల్లడించారు. మొదటి డీఐఈవో జిల్లాలోని చిన్నబోనాలలోని గురుకులం కళాశాల, కేజీబీవీ కళాశాలను సందర్శించినట్లు తెలిపారు.

9న వేములవాడలో టీయూడబ్ల్యూ జే (143) మూడు జిల్లాల మహాసభ

ముస్తాబాద్, ఫిబ్రవరి 3: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూ జేహెచ్ 143) మూడు జిల్లాల మహాసభను విజయవంతం చేయాలని మండల కేంద్రంలో వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, ముస్తాబాద్ 143 ప్రెస్‌క్లబ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 9న వేములవాడ పట్టణంలోని మహాదేవ్ కల్యాణ మండపంలో మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన జర్నలిస్టులు మహాసభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ముస్తాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా నాయకుడు చుంచు బాబు, పర్శరాములుగౌడ్, కూర సంతోష్, శంకరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలిపాక నర్సయ్య, మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షులు సయ్యద్ అలీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 3: హరిదాస్ నగర్ శివారులో ఓ బాలుడు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని తీవ్రగాయాల పాలైన ఘటన సోమవారం జరిగినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన చేకూటి మమత తన కుమారుడితో కలిసి హరిదాస్‌నగర్‌లో జరుగుతున్న ఓ శుభకార్యానికి వచ్చారు. సోమవారం హరిదాస్‌నగర్ శివారులోని అమరవీరుల స్తూపం వద్ద సత్యం కుమారుడు మోక్షిత్ (6) మక్క జొన్న కంకి కొని రోడ్డు దాటుతుండగా కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న ఓ కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన బాలుడు మోక్షిత్‌ను కరీంనగర్ అఖిరా దవాఖానకు తరలించారు. బాలుడి బంధువు మండల కేంద్రానికి చెందిన మానుక నాగరాజు ఠాణాలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు నడుపుతున్న గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన దుంపల వంశీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న స్కావెంజర్లు

సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ జిల్లా కన్వీనర్ లక్ష్మణ్‌యాదవ్

కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్స్, స్కావెంజర్స్‌ల సమస్యలు పరిష్కరించాలని వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద కార్మికుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. అనంతరం లక్ష్మణ్‌యాదవ్ మాట్లాడుతూ, స్వీపర్స్, స్కావెంజర్స్ వేతనాలు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కాకుండా కార్మికుల ఖాతాలోనే జమ చేయాలని కోరారు. నిత్యం ప్రభుత్వ పాఠశాలల్లో గదులను, టాయిలెట్స్ శుభ్రం చేస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుతామన్నారు. 5 నెలల నుంచి జీతాలు రాక బయట అప్పులు చేసి, కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జీతాలు రావడం లేదన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జీతాలు చెల్లిస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచి కార్మికులపై మోయలేని భారాన్ని ప్రభుత్వాలు మోపుతున్నాయని దుయ్యబట్టారు. బతుకమ్మ, దసరా పోయి సంక్రాంతి వచ్చినా పిల్లలకు సామన్లు కొనడానికి డబ్బులు లేవన్నారు. వేతనాలు రూ.15 వేల చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త సమ్మెకు వెళతామని ఈ సందర్భంగా వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంతం రవి, కార్మికులు ఉన్నారు.

లేబర్ అడ్డా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి

లేబర్ అధికారి నజీర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : సిరిసిల్లలోని లేబర్ అడ్డాపై పని చేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని లేబర్ అధికారి నజీర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం లేబర్ అధికారి నజీర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, సిరిసిల్ల లేబర్ అడ్డా మీద పనిచేస్తున్న స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకొని అడ్డా మీద కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. లేబర్ అడ్డాపై ఇతర రాష్ట్రాల కార్మికులు వచ్చి అతి తక్కువ వేతనాలు తీసుకుంటూ పని చేయడం వలన స్థానిక కార్మికులకు ఉపాధి తగ్గిపోయిందన్నారు. నెలలో కనీసం 10 రోజులు పని దొరకక కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంబంధిత అధికారులను ఆదేశించి, సిరిసిల్లలో వలస కార్మికుల చట్టాన్ని అమలు చేసి, స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ, యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గణేశ్ ఉన్నారు.

నిబంధనలు పాటించని ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసిన వైద్యాధికారులు

రుద్రంగిలోని ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

రుద్రంగి, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలోని ఓ ఆర్ఎంపీ క్లినిక్‌ను మండల వైద్యాధికారి వేదాచారి సోమవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి వేదాచారి మాట్లాడుతూ, మండల కేంద్రానికి చెందిన ఓ బాలికకు దెబ్బ తగలడంతో మండల కేంద్రంలోని ఓ ఆర్ఎంపీ క్లినిక్‌కు తీసుకెళ్లడంతో ఆర్ఎంపీ వైద్యుడు బాలికకు టీటీ ఇంజక్షన్ ఇచ్చాడని, ఇంజక్షన్ చేసిన చోట ఇన్‌ఫెక్షన్ అయి ఉబ్బడంతో కోరుట్లలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లడంతో ఆపరేషన్ చేశారని తెలిపారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు.. జిల్లా వైద్యాధికారి ఆదేశాలతో సదరు ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆర్ఎంపీ క్లినిక్‌లో ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. నియ మనిబంధనలు పాటించని ఆర్ఎంపీలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ అర్చన, ఏఎన్ఎంలు విజయ, లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలి

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చందుర్తి, ఫిబ్రవరి 3 : మండలంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి నిరుపేదలకు పంపిణీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాములు, మండలాధ్యక్షుడు అమరబండ ప్రసాద్ చందుర్తి రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అంద జేశారు. ప్రభుత్వ భూములను గుర్తించడానికి జిల్లాస్థాయిలో ఒక కమిటీ వేసి, కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములపై విచారణ చేసి వెంటనే ఆ భూములను గుర్తించి అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేశ్ చందుర్తి మండలం ప్రధాన కార్యదర్శి అనపర్తి సతీష్, ఉపాధ్యక్షుడు హనుమయ్యాచారి, నాయకులు చిలుక పెంటయ్య, నర్సయ్య, మట్కమం మల్లేశం, తిప్పని శ్రీనివాస్, మల్లేశం, బొరుగాయ ప్రసాద్, వేణు, గడ్డం పెద్దరాజు ఉన్నారు.

సిరిసిల్ల సరిహద్దులో అఘోరీ

జిల్లెల్ల చెక్‌పోస్ట్ వద్ద అడ్డుకున్న పోలీసులు

వేములవాడ / సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 3 : వేములవాడ రాజన్న ఆలయంలోని దర్గాను ఫిబ్రవరి కూలుస్తానని అఘోరీ గతంలో హెచ్చరించిన నేపథ్యంలో సోమవారం జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. సోమవారం జిల్లాలోని సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద పోలీసులను మోహరించి వాహనాల తనిఖీలు చేశారు. సాయంత్రం 4.00 గంటలకు జిల్లెల్ల చెక్‌పోస్టు వద్ద అఘోరీ తన వాహనంతో చేరుకోవడంతో రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. వాహనాన్ని నిలిపివేసి అఘోరీతో మాట్లాడారు. ఈ సందర్భంగా అఘోరీ వాగ్వాదానికి దిగింది. భారీగా పోలీసులు మోహరించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సుమారు 3గంటలపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. దీంతో పోలీసులు టోషన్ యంత్రంతో అఘోరీ ఉన్న కారుతో సహా సిద్దిపేటకు పంపించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.

అఘోరీతో మాట్లాడుతున్న పోలీసులు

పర్మిట్ రూంలో ఒకరు మృతి

ముస్తాబాద్, జనవరి 3 : మండలకేంద్రంలో ఓ వైన్ పక్కన నడుస్తున్న పర్మిట్ రూంలో సోమవారం ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. నామాపురానికి చెందిన తిపురి నారాయణ (50) పర్మిట్ రూంలో సప్లయర్‌గా పని చేస్తున్నట్లు స్థానికులు తెల